క్లుప్తంగా

మార్కెట్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రజిత

గంగాధర: అందరి సహకారంతో మార్కెట్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం రజిత అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. మార్కెట్‌కు సంబంధించిన అభివృద్ధి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం అమ్ముకోవడానికి వచ్చే రైతులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తోట కరుణాకర్ పాలకవర్గం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

చిగురుమామిడి: ఇళ్ల స్థలాల కోసం చిగురుమామిడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిట్టంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమేశ్‌కు మండలంలో జర్నలిస్టులు బుధవారం వినతిపత్రం అందించారు. సర్వేనంబర్ 840 లో ఉన్న ముప్పై గుంటల ప్రభుత్వ భూమిని సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బుర్ర పర్శరాములు, కొంకట బాలయ్య, రాకం కరునాకర్, పత్తేం రమేశ్, గుడికందుల దాస్, వెల్పుల క్రాంతికుమార్, ఎనగందుల రవీందర్, తాళ్ల నరేశ్, బొల్లబత్తిని మహేశ్, బోయిని సంపత్, శ్రీకాంత్ ఉన్నారు.

ఇన్నోవేషన్ సెమినార్

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు సాంకేతిక విజ్ఞానంతో కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇన్నోవేషన్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలకు ఉపయోగపడేలా స్టార్టప్ ప్రారంభించాలని, కొత్త ఆలోచనలతో వచ్చే అధ్యాపకులు, విద్యార్థులను కళాశాల ఎల్లవేళలా ప్రోత్సాహిస్తుం దన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రాజేంద్రప్రసాద్, డీఆన్ ఆర్‌అండ్‌డీ, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ ప్రవీన్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్, సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు మనోజ్‌కుమార్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి.రమేశ్, కళాశాల అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ జి.మల్లయ్య, అధ్యాపకులు ఉన్నారు.

వరిలో అగ్గి తెగులు



వరిపంటను పరిశీలిస్తున్న ఏవో వెంకటేశ్

శంకరపట్నం: వరికి అగ్గి తెగులు సోకిందని ఏవో వెంకటేశ్ తెలిపారు. మండలంలోని కాచాపూర్, కల్వల గ్రామాల్లో బుధవారం వరి పొలాలను పరిశీలించారు. అనంతరం తెగులు నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలని సూచించారు. వెంట ఏఈవో రాజ్ కుమార్, రైతులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రజక సంఘం నాయకులు

హుజూరాబాద్: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు, ఆమె మనవరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించడానికి నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రజక సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండపాక శ్రీనివాస్, నాయకులు కొలిపాక శంకర్, శ్రీనివాస్, నల్ల బాలరాజు, గోపు వెంకటేశ్వర్లు, నాగవెల్లి రాజు, సుంకరి రాజేందర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్లు.. 6 సార్లు గండి





కల్వల ప్రాజెక్టుకు గండిపడటంతో దిగువకు పోతున్న నీరు

శంకరపట్నం: శంకరపట్నం, వీణవంక మండలాలకు వరప్రదాయిని కల్వల ప్రాజెక్ట్ నిర్మించి 60 ఏళ్లు కాగా ఐదుసార్లు గండిపడింది. సాగు నీరు, తాగునీటికి వీణవంక మండల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అప్పటి కమలాపూర్ ఎమ్మెల్యేలు కేవీ నారాయణరెడ్డి, పరిపాటి జనార్దన్‌రెడ్డిల సహకారంతో వీణవంకకు చెందిన పాడి సుధాకర్‌రెడ్డి శంకరపట్నం మండలం గద్దపాక గ్రామంలో కల్వలలో ప్రాజెక్ట్ నిర్మించాలని అత్యంత ఆప్పుడు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందారెడ్డిని కోరారు. అంతేకాకుండా 1960లో ఆయన ద్వారా నిధులు మంజూరు చేయించారు. కాసు బ్రహ్మానందారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన శిలాఫలకం కూడా ఉంది.

మొదటి గండి ఎప్పుడు పడిందంటే..

1964లో కల్వల ప్రాజెక్ట్ నిర్మించగా 25 ఏళ్లపాటు శంకరపట్నం,వీణవంక మండలాల్లోని పది గ్రామాల ప్రజలకు సాగు, తాగునీటి ఇబ్బందులు తీరాయి. 1989 ఆగస్టు 22న కల్వల మత్తడి వద్ద గండిపడింది. దాదాపు దశాబ్దకాలం ఎవరూ పట్టించుకోలేదు. 2001లో అప్పటి కమలాపూర్ ఎమ్మెల్యే ముద్దసాని దామోదర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి మరమ్మతులు చేయించారు. 2006 జూలై 23న భారీ వర్షాల వల్ల ప్రాజెక్టుకు గండిపడగా మరమ్మతు చేసినా మళ్లీ గండిపడింది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో రింగ్‌బండ్ వేశారు. మళ్లీ ఏడాదికి గం



డిపడడంతో 2009లో పూర్తిస్థాయిలో మరమ్మతుకు నోచుకుంది. 2023 జూలైలో మత్తడికి మళ్లీ గండిపడగా రూ.ఎనిమిది లక్షలో రింగ్‌బండ్ వేశారు. ఈ ఏడాది జూలై 21న మరోసారి గండిపడడంతో నీరంతా దిగువకు వెళ్తోంది.



శంకరపట్నం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కేశవపట్నం, అంబాల్‌పూర్ గ్రామాల్లో పంట పొలాలు నీట మునగడంతోపాటు కోతకు గురయ్యాయి. తాడికల్ గ్రామ శివారులో బీటీ రోడ్డు సగం వరకు కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు రోడ్డుపై ప్రయాణం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి

శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సెల్ నం : 81794 86822

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న మెప్మా పీడీ స్వరూపరాణి

హుజూరాబాద్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని మెప్మా పీడీ స్వరూపరాణి అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పోషణ సంబరాలు, పౌష్టికాహారం వల్ల జరిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం పౌష్టికాహార ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలోని మహిళా సంఘాల పనితీరు, పుస్తక నిర్వహణ, ఆదాయ, వ్యయాల విషయాలపై పరిశీలన జరిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ సమ్మయ్య, డీఎంసీ శ్రీవాణి, పలువురు ఆర్పీలు, ఓబీలు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

మానకొండూర్: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు మంచి ఆహారం అందివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ రేవంత్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, విజయ, పద్మ, అరుణ, పద్మ రాణి, నిర్మల పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలి

జమ్మికుంట: పరిసరాల శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘం సభ్యులతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్ర, మంగళవారాల్లో డ్రై డే ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని, తడి,పొడి చెత్తను వాహనాలకు వేర్వేరుగా అందించాలన్నారు. ప్లాస్టిక్ సంచులు, కవర్లను వినియోగించకుండా జ్యూట్, బట్ట సంచులు ఉపయోగించాలని, చుట్టుపక్కల మహిళలకు అవగాహ కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, సీఎల్ ఆర్పీ మంజుల, ఆర్పీలు దేవేంద్ర, రజిత, మల్లీశ్వరీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ అయాజ్

చేనేత హస్తకళ మేళా ప్రారంభం

హుజూరాబాద్: చేనేత హస్తకళ మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. పట్టణంలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో శ్రీకళాకృతి చేనేత హస్తకళ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళ ప్రదర్శనను బుధవారం ప్రారంభించి వివిధ స్టాళ్లను పరిశీలించారు. వివిధ ప్రాంతాలకు చెందిన కాటన్, స్కిల్ వస్త్రాలతోపాటు చెక్క బొమ్మలు, ఇతర వస్తువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉత్పత్తిదారుల నుంచి నేరుగా వినియోగదారులకు తక్కువ ధరకు వస్తువులు అందించటమే తమ లక్ష్యమని, మేళా 25వ తేదీ వరకు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూపాక సింగిల్ విండో సభ్యుడు కంకణాల రమేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మేళాను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

సీసీఆర్టీలో ఇంగ్లిష్ టీచర్‌కు ప్రశంస పత్రం



ప్రశంస పత్రం అందుకుంటున్న టీచర్ రాజు

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ దుస్స రాజు అస్సాంలోని గౌహతిలో జరిగిన సీసీఆర్టీ వర్క్‌షాపుకు హాజరయ్యారు. చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంరక్షణలో పాఠశాలల పాత్ర అంశంపై కేంద్రసాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ అండ్ ట్రైనింగ్ వర్క్‌షాపు నిర్వహించారు. పలు రాష్ట్రాల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొనగా రాష్ట్రం నుంచి ఇద్దరు టీచర్లు వర్క్‌షాపలో పాల్గొన్నారు. ఒకరు సిద్దిపేట, మరొకరు కరీంనగర్ జిల్లాకు చెందినవారు. ఈ నెల 5వ తేదీ వరకు జరిగిన వర్క్‌షాపులో రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ, బతుకమ్మ పాటపై నృత్యం చేసినట్టు రాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా అస్సాం సినిమా డైరెక్టర్ గోస్వామి చేతుల మీదగా ప్రశంస పత్రం అందుకున్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన



అవగాహన కల్పిస్తున్న డీఎస్‌ఆర్సీ కౌన్సిలర్ బబిత

జమ్మికుంట: అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించవచ్చని హుజూరాబాద్ డీఎస్‌ఆర్సీ కౌన్సిలర్ బత్తుల బబిత అన్నారు. పట్టణంలోని లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వృత్తిలో భాగంగా చాలా రోజులు ఇంటిని వదిలి దూరప్రాంతాలకు వెళ్లాల్సిన సమయంలో హెచ్‌ఐవీ బారినపడే అవకాశాలున్నాయని, వ్యాధి సోకినవారు అధైర్యపడకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుంటూ మందులు వాడడం ద్వారా జీవనకాలం పెంచుకోవచ్చని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎయిడ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి, అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మల్లయ్య, అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి రియాజ్ డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

గంగాధర: గ్రామాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్య నిపుణురాలు అనూషరెడ్డి సూచించారు. బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన బుచ్చమ్మ-చంద్రమౌళి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని గట్టుభూత్కూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 250 మందికి పరీక్షలు నిర్వహించి 25 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 1380 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేశామని డాక్టర్ తెలిపారు. పేద ప్రజలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించడమే ట్రస్టు ధ్యేయమని పేర్కొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మానకొండూర్: వినాయక నిమజ్జనం భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని మానకొండూర్ ఇన్‌చార్జ్ సీఐ స్వామి ప్రజలను కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం వినాయక మండపాల నిర్వాహకులు, పలువురితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డీజేలకు పర్మిషన్‌లేదని, చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. చెరువు, కుంటల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కుల సంఘాల పెద్దలు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని గణేశ్ మండపాల నిర్వాహకులతో ఎస్సై నరేందర్‌రెడ్డి బుధవారం పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. నిమజ్జనం, వినాయకులను తరలించే సమయంలో విద్యుత్ వైర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

రామడుగు: గొడవలకు తావులేకుండా గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై వి. శేఖర్ అన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలకు సహకరించాలని, సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకరావాలని, చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

గన్నేరువరం: యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిస కావొద్దని ఎస్సై తాండ్ర నరేశ్ అన్నారు. మండలంలోని మైలారం గ్రామంలో బుధవారం రాత్రి సైబర్ నేరాలు, గంజాయి, మత్తుపదార్థాలు అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని, అనుమానిత ఫోన్‌కాల్స్, వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

రామడుగు: రామడుగు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వి. శేఖర్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు బుధవారం కలిసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాజయ్య, హన్మయ్య, శ్రీనాథ్‌వర్మ, స్వామి, మధు, విజయ్, అశోక్, నర్సింహా, వినయ్, నర్సయ్య పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం

రామడుగు: మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్ పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్, మండల నోడల్ అధికారి రంగనాథశర్మ బుధవారం ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులు అన్ని క్రీడల్లో రాణించడం కోసం ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రావు, హెచ్‌ఎం రమేశ్, పీడీలు రమేశ్‌కుమార్, ఇజాజ్ హమ్మద్, రుపారాణి, వీర్‌పాల్‌రెడ్డి, పీఈటీలు వెంకటలక్ష్మి, దేవేంద్ర, దీప, ఆశాలు, ఉమాశంకర్, శ్రీకాంత్, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, పద్మలత, మల్లేశం, రామస్వామి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో వేణుకుమార్

బీజేపీ సభ్యత్వ నమోదు

గన్నేరువరం: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలకేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరచారి బుధవారం ప్రారంభించారు. దేశం, ధర్మం, సమాజ శ్రేయస్సు కోసం పని చేసే పార్టీ బీజేపీ అని అన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేష్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మలాదేవి హాజరై మాట్లాడారు. బీజేపీ సమష్టి నిర్ణయం ప్రకారం ముదుకు వెళ్తుందన్నారు. హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగులలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమధువని నరసింహరాజు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

సంక్షిప్త వార్తలు

● చెరువులు పరిశీలించిన ఈఈ

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో చెరువులు, కుంటలను ఎస్సారెస్పీ ఈఈ నాగభూషణం బుధవారం పరిశీలించారు. కుంటల ఆక్రమణపై హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబుకు కొంత మంది రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కుంటలను డీఈ కవిత, ఏఈ రమేశ్‌తో కలిసి పరిశీలించారు. రెండు రోజుల్లో సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేయాలని సర్వేయర్‌ను ఆదేశించారు.

● ఓటరు జాబితాపై సమావేశం

శంకరపట్నం: ఓటరు జాబితాపై తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఓటరు లిస్టులో సవరణ, అభ్యంతరాలపై తహసీల్దార్ భాస్కర్ వివిధ రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు.

● ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి: మండలంలోని చాకుంటలో పెద్ది బాలయ్య, ఆర్నకొండలో మల్లయ్య, గుమ్లాపూర్‌లో బీసవేని శ్రీనివాస్ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం పరామర్శించారు. ఆర్థికసాయం చేశారు.

● మాజీ ఎమ్మెల్యే పూజలు

చొప్పదండి: మండల కేంద్రంలోని వినాయక మండపాలలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురిని పరామర్శించారు.

● డీజీపీని కలిసిన సత్యంగౌడ్

హుజూరాబాద్: హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించినట్టు మానవ విలువల పరిరక్షణ జాతీయ అధ్యక్షుడు, ప్రజాకవి, పట్టణానికి చెందిన నాగుల సత్యంగౌడ్ తెలిపారు. ఫ్రెండ్లీ పోలీస్ అభినందనీయమని పేర్కొన్నారు.

● గోపాల్‌రావుపేటలో అన్నదానం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో శ్రీగణేశ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. వెదిర శ్రీభక్త మార్కండేయ ఆలయం శ్రీగణేశ్ మండపంలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

● నూతన కార్యవర్గం

గన్నేరువరం: బ్రిడ్జి సాధన కమిటీ యాస్వాడ గ్రామ అధ్యక్షుడిగా మామిడిపెల్లి లక్ష్మణ్‌ను నియమిస్తూ బ్రిడ్జి జేఏసీ కమిటీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ బుధవారం మండలకేంద్రంలో నియామకపత్రం అందజేశారు. అలాగే ఉపాధ్యక్షుడిగా గువ్వల చిన్న నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా కవ్వంపల్లి అంజయ్య, ఉపకార్యదర్శిగా వడ్లూరి సతీశ్‌ను నియమించినట్టు తెలిపారు. మైలారం మైసమ్మ గుట్ట నుంచి కరీంనగర్ వరకు మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి పోరాటం చేస్తానని పేర్కొన్నాడు.

● స్నేహితుల ఆర్థికసాయం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన మహబూబ్‌పాషా ఇటీవల మృతిచెందగా గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ 1993-94 పదో తరగతి విద్యార్థులు బుధవారం స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.28,000, క్వింటాల్ బియ్యం అందించారు. షాబీర్ తల్లి ఇటీవల చనిపోగా కుటుంబాన్ని పరామర్శించి రూ.5000నగదు, యాభై కేజీల బియ్యం అందించారు.

చొప్పదండి: పట్టణానికి చెందిన గర్షకుర్తి రాజ్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందగా చిన్ననాటి మిత్రులు రూ. 50 వేల ఆర్థిక సాయం చేశారు. రాజ్‌కుమార్‌తో చదువుకున్న 1989-90 పదో తరగతి మిత్రులు నగదు సేకరించి, మృతుడి భార్య లావణ్య, కుమారుడు అమన్ సాయిపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బుధవారం డిపాజిట్ పత్రాలను అందించారు.

● టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

చిగురుమామిడి: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను మాజీ జెడ్పీటీసీ రవీందర్, డీసీసీ అధికార ప్రతినిధి సత్యనారాయణరెడ్డి, మండలంలోని కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు.

● సీఎం సమీక్షపై ఆర్టీసీ కార్మికుల నిరాశ

హుజూరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీపై చేట్టిన సమీక్షపై కార్మికులు తీవ్ర నిరాశలో ఉన్నారని బీసీ కులగణన సాధన సమితి, ప్రజా సంఘాల నాయకులు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు తెలిపారు. బుధవారం పట్టణంలో మాట్లాడారు. సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించారని సమస్యలు, జీతభత్యాలు తదితర అంశాలు చర్చించలేదన్నారు. తొమ్మిది నెలలకే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

● నేత్రదానంపై అవగాహన

జమ్మికుంట: పట్టణంలోని శాలవాడకు చెందిన దిడ్డి కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతుని నివాసంలో బుధవారం సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో నేత్రదానం, సంస్మరణ సభ నిర్వహించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు జ్ఞాపిక, కృతజ్ఞతలు తెలిపారు.

● గీత కార్మికుడి కుటుంబానికి చేయూత

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు బొంగోని రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీణవంకకు చెందిన ట్యూరిటో సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి అనుచరుల ద్వారా రూ.ఐదువేలు మృతుని కుటుంబానికి అందించారు.

క్రైం వార్తలు

పోలీసుల తనిఖీలు

గంగాధర: మండలంలోని వెంకంపల్లి గ్రామ శివారులోని ఓ పౌల్ట్రీఫారంలో గంజాయిమొక్కలు పెంచుతున్నారనే సమాచారంతో బుధవారం సాయంత్రం గంగాధర ఎస్సై నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. గంజాయి మొక్కను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మొక్క అని తెలియని పూలమొక్క అనుకున్నామని యజమాని తెలిపాడు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక: మండలంలోని శ్రీరాములపేట గ్రామంలో ట్రాలీఆటోలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా గ్రామానికి వెళ్లగా శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన అంగిడి సుధాకర్, ఇల్లందకుంటకు చెందిన లోకిని శ్రీనివాస్ ట్రాలీ ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. పేదల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి కరీంనగర్‌లోని కోళ్లఫారం యజమానులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని, సుధాకర్, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

దారి కోసం వివాదం ..

జమ్మికుంట: పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ వెనుకాల ఇంటి నిర్మాణంలో బుధవారం వివాదం ఏర్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని గండె రాజు సర్వేనంబర్ 464, 465లోని 118 గజాల స్థలం స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతుండగా తాటిపల్లి రాజు కుటుంబ సభ్యులతో అడ్డుకున్నాడు. ఇల్లు నిర్మించుకునేవారు డయల్ 100 ఫోన్ చేయగా ఎస్ఐ ఆరోగ్యం, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. దారి కావాలని తాటిపల్లి రాజు పురుగుమందు డబ్బాతో ఆందోళనకు దిగాడు. ఇంటి పేపర్స్‌తో పోలీసుస్టేషన్‌కు వస్తే సమస్య పరిష్కరిస్తామని పోలీసులు ఇరువర్గాలకు సూచించడంతో సమస్య సద్దుమణిగింది. కాగా సాయంత్రం గుండె రాజు ఫిర్యాదు మేరకు తాటిపల్లి రాజు, సంధ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ రవి తెలిపారు.